ఆంధ్రజ్యోతి
5★

పెద్దపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 29 సెప్టెంబరు 2025







బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ



- 42 శాతం కల్పించడంపై హైకోర్టులో పిటిషన్
- వచ్చే నెల 8న తుది విచారణ
- నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం

8



నేడు సద్దుల బతుకమ్మ

- ఏర్పాట్లు పూర్తి
- తీరొక్క పూలతో వేడుక
- మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి

పెద్దపల్లి కల్చరల్/మార్కండేయకాలనీ/కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): రామా రామా రామా... ఉయ్యాలో... రామనే శ్రీ రామ ఉయ్యాలో... అంటూ తెలంగాణ సంస్కృతి సంప్రదయాలకు అద్దం పట్టే మహి ళల సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వసిద్ధమయ్యింది.. జిల్లాలో సోమవారం సద్దుల బతుకమ్మ సంబరాలను ఆడబిడ్డలు జరుపుకోనున్నారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన రంగురంగుల బతు కమ్మలను తీర్చదిద్దనున్నారు. కొనుగోళ్ళతో కూడళ్ల రద్దీగా మారాయి... పెద్దపల్లి ఎల్లమ్మ చెరువు ట్యాంక్ బండ్‌పై బతుకమ్మల ఆటకు ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్రంలో బాద్రపద మాసం అమావాస్య నుండి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండుగ, సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. తెలంగాణ సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ.

రంగు రంగుల పూలను పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ ఒక లయతో అడుగులు వేస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలను పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలి పువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, ఇలా దేని ప్రత్యేకత దానిదే.... తొమ్మిది రోజులపాటు కొనసాగే బతుకమ్మలను చెరువులు, నీటి ప్రవాహంలో నిమ జ్జనం చేస్తారు. బతుకమ్మ పాటల్లో మహిళల తమ కష సుఖాలు, ప్రేమ, స్నేహం, బందుత్వం, అప్యా యతలు ఉంటాయి. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారిత నంలో నలిగి పోతున్న గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు



దుర్భరంగా ఉండేవి. వారి ఆకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతారు.

ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతకాలపు తొలి రోజుల్లో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్ని మంచినీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు

(మిగతా 8వ పేజీలో)

కాంగ్రెస్ ప్రజాపాలనలోనే గ్రామాల అభివృద్ధి

8

























జీవనశైలిపై ఆధారపడే మన ఆరోగ్యం



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ గౌస్ ఆలం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉందని, మంచి జీవనశైలి, పౌష్టికాహారంతోనే గుండె పదిలంగా ఉంటుందని పోలీసు కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపట్టిన 2కే వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గుండె జబ్బుల బారిన పడడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌ను సాధారణ స్థాయిలో ఉంచుకుంటే గుండె జబ్బులు దూరమవుతాయన్నారు. సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ వాక్‌థాన్‌కు జనరల్ ఫిజీషియన్స్, జనరల్‌సర్జన్స్, ఆర్థోపెడిక్ సర్జన్స్, గైనకాలజిస్టు అసోసియేషన్లు, మాతాల్యాబ్, పూర్ణిమ ఫెర్టిలిటీ, ఐసిస్, సిస్కో, ఎంజీఆర్ బ్లడ్‌బ్యాంకు, లాడిలిషియన్, ఆర్‌జీపీ సంస్థలు సహకారం అందించాయన్నారు. వైద్యులు అనీష్‌పబ్బ, వాసుదేవరెడ్డి, వినయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి లోకేష్ బీరకాయల, తాహా, దిలీప్‌రెడ్డి, వేణుగోపాల్, నాగరాజు, రాజీవ్‌రెడ్డి, సత్యనారాయణ, పల్లవి, ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ పాల్గొన్నారు.

జంగపల్లి కల్వర్టుకు మరమ్మతులు



కల్వర్టుకు చేస్తున్న మరమ్మతు పనులు

గన్నేరువరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు మండలంలోని జంగపల్లి వద్ద ధ్వంసమైన కల్వర్టుకు ఆదివారం మరమ్మతులు చేశారు. డీసీసీఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో భారీఎక్స్‌కవేటర్‌తో కల్వర్టును అడుగునుంచి పైపులను వేసి మట్టినినింపి రోడ్డును పునరుద్ధరించారు. దీంతో యథావిధిగా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, కల్లెం మల్లారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

'చిటికెన'కు జాతీయ సాహిత్య పురస్కార ప్రదానం



అవార్డు అందుకున్న కిరణ్

సిరిసిల్ల సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన సాహితీవేత్త, విమర్శకుడు డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్‌కు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య తొలి పురస్కారం ప్రదానం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని కేంద్రగ్రంథాలయంలో అఖిలభారతపద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అవార్డులప్రదానోత్సవం జరిగింది. సాహిత్యసేవలను గుర్తించి కిరణ్‌కు సినీగేయరచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ స్మారకార్థంగా ఏర్పాటు చేసిన అవార్డును గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రియాజ్ అలీ, పద్మశాలి అన్నసత్రాల మార్గదర్శకులు చిలువేరి కాశీనాథ్, అఖిలభారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణలు అందించి సత్కరించారు.

జాషువా జయంతి



జాషువా జయంతిలో పాల్గొన్న కవులు, రచయితలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 28 ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహితీఆధ్వర్యంలో ఆదివారం సంస్థ కార్యాలయంలో జాషువా జయంతి నిర్వహించారు. అనంతరం జిల్లాశాఖ ఎన్నికలు జరిగాయి. జిల్లా ప్రధానకార్యదర్శి మానువాడ శంకర్, రాష్ట్రకార్యదర్శి మాడుగుల రాములు, పురుషోత్తం సతీశ్, పెంటఅంజయ్య, పొత్తూరుదేవదాసు, లక్ష్మీనారాయణ, కిషోర్,సదానందం,గంగాధర్, శ్రీనివాస్, గిరిధర్‌రావు, ఐలయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులకు సూచించారు. మండలంలోని పొత్తూరు గ్రామసమీపంలోని వంతెన వద్ద ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. మానేరు వంతెన పక్కనుంచి మానేరు వాగులో దిగి పుణ్యస్నానాలు చేయడానికి ప్రతిరోజు భక్తులు వస్తున్నందున మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా, మెట్లు నిర్మించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రజల సౌలభ్యం కోసం పనులు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఇరుమల్ల నర్సయ్య, ఒట్టె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



సుభాష్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో సంభవించే మరణాల్లో 25 శాతం గుండె సంబంధిత మరణాలు ఉన్నాయని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒక్కరు గుండె సంబంధిత సమస్యలతో మరణిస్తున్నారు. గుండె సంబంధి వ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్ డే ను నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం గుండె సంబంధిత వ్యాధులతో చనిపోతున్నవారి సంఖ్య 25 నుంచి 30 శాతం పెరుగుతూ వస్తోంది. జీవనశైలి, కలుషిత ఆహారం, సమయానికి భోజనం చేయకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, సరైన నిద్రలేకపోవడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, కూరగాయలను తినడం తగ్గించడం వంటివి ప్రధాన కారణాలు. కాలుష్యం కూడా ఒక కారణమని, కల్తీ ఆహారం, ఆహార నియమాలు లేకపోవడం వల్ల ఎదిపడితే అది తినేస్తున్నారని, దీంతో కూడా గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులు అంటున్నారు.

మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లే కారణం...

-డాక్టర్ పబ్బ అనీష్, కార్డియాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్



గుండె జబ్బులు రావడానికి మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు ప్రధానకారణం. చాలా మంది జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. శారీరక శ్రమ కూడా లేదు. చాలా మంది ఇంటి దగ్గర షాపుకు వెళ్లాలన్నా వాహనంపై వెలుతున్నారు. నడవడం లేదు. గతంలో చాలా మంది శ్రమతో కూడిన పనులు చేసేవారు. నేడు అంతా యాంత్రికంగా పనులు జరుగుతున్నాయి. ఆహారం విషయానికి వస్తే కూరగాయలు తగ్గించి, మాంసాహారం ఎక్కువగా తీసుకుంటున్నారు. తిన్నదానికి తగిన శ్రమ లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. పాలిష్ రైస్ తీసుకోవడం కూడా ఒక కారణం. వీలనైంతవరకు దంపడు బియ్యం, మిల్లెట్స్ తీసుకోవడం మంచిది. ప్రతి రోజు చక్కటి పౌష్టికాహారం తీసుకోవడం, వాకింగ్ లేదా యోగా చేయడం, మాంసాహారం మితంగా తీసుకోవడం, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండడం వల్ల మనం గుండెను కాపాడుకోవవచ్చు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- డాక్టర్ కృష్ణచైతన్య,
అపోలోరీచ్ హాస్పిటల్, కరీంనగర్



గుండె సంబంధిత వ్యాధుల బారిన పడడం మనం తీసుకునే ఆహారంతోపాటు బీపీ, షుగర్ కూడా కారణమవుతుంది. బీపీ, షుగర్ ఉన్నవారు రెగ్యులర్‌గా మందులు తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ డాక్టర్ సలహాలు సూచనలు పాటించడం వల్ల గుండె జబ్బులు రాకుండా నివారించవచ్చు. కొవ్వు పదార్థాలు, ఉప్పు, శుద్ధి చేసిన చక్కెరను అధి కంగా తీసుకోవడం వల్లకూడా గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. పొగాకు ఉత్పత్తులను వాడడం, ఆల్కహాలు తీసుకోవడం మంచిది కాదు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి ఆహారం తీసుకోవడం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండడం, ఒత్తిడికి గురికా కుండా ఉండడం, సరైన నిద్ర, శారీరక శ్రమ మనిషికి చాలా అవసరం.

జడ్పీ చైర్మన్ స్థానాలు మాదిగలకు కేటాయించాలి

● మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలఎన్నికల్లో నాలుగు జిల్లా పరిషత్‌చైర్మన్ స్థానాలను మాదిగలకే కేటాయించాలని మాదిగహక్కుల దండోరా గౌరవాధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. ఆదివారం నగరంలోని ఒకహోటల్‌లో దండోరా రాష్ట్రఅధికార ప్రతినిధి ఎల్కపల్లి రాజేందర్ అధ్యక్షతన ఉమ్మడిజిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ షమీమ్ అఖ్తర్ కమిషన్ పేర్కొన్న విధంగా రాష్ట్రంలో 10శాతం ఉన్న మాదిగలకు స్థానికసంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ మొదలుకొని జిల్లా పరిషత్ చైర్మన్‌తోపాటు నామినేటెడ్ పదవుల్లో సైతం వాటా దక్కాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మహిళావిభాగం సమన్వయకర్త అందెల భవానిరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు ఎలుకపెల్లి జనార్దన్, కవ్వంపల్లి రవి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మేతరి రోజారాణి, జిల్లా అధ్యక్షుడు మాట్ల రమేశ్, జగిత్యాల జిల్లాఅధ్యక్షుడు మంతెన స్వామి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలుక రాజేశం, సప్పి పోచన్న, తాటిపెల్లి బాపు, శ్రీదేవి, నాగరాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తాం..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతినెలా సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం, గ్యాస్ సబ్సిడీ ద్వారా 3 వేల వరకు మేలు జరుగుతోందన్నారు. సుడాచైర్మన్‌గా కరీంనగర్ నియోజకవర్గంతో పాటు సుడా పరిధిలో ఉన్న అన్ని నియోజక వర్గాలకు నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే 15 కోట్ల రూపాయలు సుడా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నీ స్కాంలేనని, బతుకమ్మ చీరలు కూడా తక్కువ నాణ్యతవి పంపిణీ చేశారని ఆరోపించారు. బతుకమ్మ చీరల కోసం బీఆర్ఎస్ ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలు అందించాలనే ఉద్దేశంతో ఉందన్నారు.

పార్టీ నాయకులు ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, దండి రవీందర్, అనిల్ కుమార్, కుర్ర పోచయ్య, పెద్దిగారి తిరుపతి, షబానా మహమ్మద్, ముల్కల కవిత, ఊరడి లత, అస్తపురం తిరుమల, తోట అంజన్న, లింగ మూర్తి, బషీర్, జ్యోతిరెడ్డి, రాజ్‌కుమార్, వెంకటరెడ్డి, పర్వతం మల్లేశం, ఆంజనేయులు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కోతులను వెళ్లగొట్టే ప్రయత్నంలో కిందపడి ఒకరి మృతి



రాజయ్య(ఫైల్)

కోనరావుపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోతులను వెళ్లగొట్టే ప్రయత్నంలో కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన కోనరావుపేట మండలంల సుద్దాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాల గ్రామానికి చెందిన బొడ్డు రాజయ్య(60) ఉపాధినిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లి ఆరోగ్యం సహకరించక తిరిగి వచ్చాడు. కొంతకాలంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. కోతుల గుంపు ఇంటిపైకి రావడంతో వాటిని వెళ్లగొట్టే ప్రయత్నంలో ఒక్కసారిగా మీదికి రావడంతో గట్టిగా అరిచి కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు చూసి వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్లగా పల్స్‌రేటు పడిపోయిందని మృతిచెందాడని తెలిపారు. రాజయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కోతులబారి నుంచి రక్షించాలని అధికారులను గ్రామస్థులు వేడుకుంటున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

శంకరపట్నం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ గ్రామంలోని బుడగజంగాల కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. బాధితుడు ఊర అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. దీంతోఇల్లు నిర్మించుకుంటూ గుడిసెలో నివాసం ఉంటున్నాడు. అనిల్ బోళ్లు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజూలాగానే అనిల్ ఉదయంబోళ్లు అమ్మడానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. గుడిసెనుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు అనిల్‌కు సమాచారం అందించారు. అనిల్ ఇంటికి వచ్చి చూసేసరికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న సామగ్రి, అర్ధతులం బంగారం, 10 తులాలవెండి, రూ.50వేల నగుదు కాలిపోయాయి. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని అనిల్, కుటుంబ సభ్యులు కోరారు.



దగ్ధమైన సామగ్రి

శాలువాలను డ్రెస్సులుగా మార్చాలనే ఆలోచన గొప్పది

● శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులుగా ప్రజలు గౌరవంతో తీసుకువచ్చే శాలువలను డ్రెస్సులుగా కుట్టి చిన్నారులకు ఉచితంగా పంపిణీ చేయాలనే ఆలోచన రావడం గొప్పవిషయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తన కోసం తీసుకువచ్చిన శాలువాలను పోగుచేసి వాటిని అందమైన డిజైన్‌లో కుట్టించి వాటిని చిన్నారులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఆలోచన చేసిన తన తనయుడు ఆది కార్తీక్‌ను ఆది శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి ఆరవ వార్డు శౌరాలకాలనీ, పార్వతిపురం కాలనీల్లోని చిన్నారులకు దసరా కానుకగా దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీలం గురువయ్య, కాశ శ్రీనివాస్, చిలివేరి శ్రీనివాస్, సల్మాన్‌రెడ్డి, జడల రవీందర్, శంకర్, అక్కనపల్లి నరేష్, పర్శరాములు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు. తదితరులు ఉన్నారు.



శాలువాలతో తయారు చేసిన దుస్తులను పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

గల్ఫ్‌కార్మికుడి కూతురు డీఎస్పీగా ఎంపిక



మహేశ్వరి



శ్రీకాంత్

కరీంనగర్ క్రైం/మానకొండూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మండలకేంద్రానికి చెందిన మోదుంపల్లి మహేశ్వరి(29) ఇటీవల విడుదలైన గ్రూపు-1పరీక్ష ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యారు. మహేశ్వరి తండ్రి మోదుంపల్లి లక్ష్మణ్ గల్ఫ్‌లో కార్మికుడిగా, ఆమె తల్లి శంకరమ్మ గ్రామంలో కూలీగా పనిచేస్తున్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేసిన మహేశ్వరి ఐఏఎస్ లక్ష్యంగా సివిల్స్‌కు సిద్ధమవుతూ గ్రూప్-1 పరీక్షలు రాశారు. రెండుసార్లు రద్దవగా మూడోసారి 2024లో రాసినపరీక్షలో రాష్ట్రస్థాయిలో 474 ర్యాంక్‌తో ఎస్సీ విభాగంలో పోలీసుశాఖలో డీఎస్పీగా ఉద్యోగం పొందారు.

ఎంపీడీవోగా ఎంపికైన వార్డు ఆఫీసర్ శ్రీకాంత్

కరీంనగర్ టౌన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అలువాల శ్రీకాంత్ గ్రూప్-1పరీక్ష ద్వారా ఎంపీడీవోగా నియామకమయ్యారు. గోపాల్‌రావుపేటకుచెందిన శ్రీకాంత్ నాలుగేళ్లుగా గ్రూప్-1కు సిద్ధమవుతున్నారు. 2024లో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 ద్వారా మున్సిపల్ వార్డు ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీకాంత్ తండ్రి అలువాల తిరుపతి వ్యాపారస్తుడు. తల్లి పుష్పలత గృహిణి. వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్-1లో ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు.

ఐదు పుస్తకాల ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భవానీ సాహిత్య వేదిక, చౌడూరు కళాపీఠం నిర్వహణలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఐదు పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రభాకర్ సంపాదకత్వంలో వచ్చిన మేరా భారత్ మహాన్, చౌడూరి నరసింహారావు రచించిన స్ఫూర్తి కిరణాలు పుస్తకాలను ప్రొఫెసర్ కాంచనపల్లి గోవర్ధనరాజు, గాండ్ల నరసిం హులు రచించిన వెలుగుల వేకువ పద్య సంపుటిని సాదనాల వేంకటస్వామినాయుడు, గద్వాల సోమన్న ఊతకర్రను పాణ్యం దత్తశర్మ, మేఘమాలను రఘు సతీశ్‌కుమార్ ఆవిష్కరించారు. కేవీ గోపాలాచార్య, సాధనాల వెంకటస్వామి నాయుడు, చౌడూరి నరసింహారావు అధ్యక్షతన ఆవృతాల వారీగా కవి సమ్మేళనాలు నిర్వహించారు. కవులను కీర్తిరత్న, కవిరత్న పురస్కారాలు, స్వర్ణ కంకణంతో సన్మానించారు.

విదేశాల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

● ఆస్ట్రేలియాలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ● హేరిస్ బర్గ్‌లో పాల్గొన్న గ్రంథాలయసంస్థ చైర్మన్



ఆస్ట్రేలియాలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



హేరిస్‌బర్గ్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేశం

గంగాధర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలు ఆస్ట్రేలియాలో జరుపుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆస్ట్రేలియాలో తెలంగాణ అసోసియే షన్ ఆఫ్ క్వీన్స్‌ల్యాండ్ ఆధ్వర్యంలో 27న బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈవేడుకలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీచైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. ఇతర దేశానికి వచ్చి నివసిస్తున్న మనవారు సంప్రదాయాలను పాటిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ వేడుక ప్రపంచంలోనే ప్రత్యేకమన్నారు. సంబరాల్లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్‌ల్యాండ్ అధ్యక్షుడు నరేందర్ కుమార్, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, కార్యదర్శి బచ్చు దయాకర్, అసోసియేషన్ ప్రతినిధులు ఉమేష్, సంతోష్‌రావు, విజయ, శ్రీకళా రూపిరెడ్డి, ప్రియాంక, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్‌వేనియాలోని హేరిస్ బర్గ్‌లో..

కరీంనగర్ కల్చరల్ : పెన్సిల్వేనియాలోని హేరిస్ బర్గ్ తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు శనివారం మెకానిక్స్ బర్గ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌తో కలసి జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేశం హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కాకర్ల శ్రీనివాస్, మునికుమార్ గిల్లా, బిషన్‌రెడ్డి, వెన్నం శ్రీరాంరెడ్డి, చంద్ర సందడి, కట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కొనగాల మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న కొనగాల మహేష్

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ కొనగాల మహేష్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ బేగంపేట్‌లోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం మహేష్‌ను ఏకగ్రీవంగా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కొనగాల మహేష్‌కు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఆదివారం ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంకెపల్లి గ్రామానికి చెందిన పండుగ సుశాంత్, మచ్చ చిరు అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై మారుపాక వైపు వెళుతూ ఎదురుగా వచ్చిన కారును ఢీకొట్టారు. ఈ సంఘనటలో ద్విచక్రవాహనంపై ఉన్న సుశాంత్, చిరులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి వారిని వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కాత్యాయని అలంకారంలో అమ్మవారు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో అమ్మవారు ఆదివారం ఏడోరోజున కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు స్వామివారికి, రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వేములవాడలో కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

● కాళరాత్రి, చండీ రూపంలో ..


ధర్మపురిలో కాళరాత్రి అలంకారంలో..


కొండగట్టులో చండీమాత అలంకారంలో..

ధర్మపురి/మల్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాళరాత్రి రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహ(యోగ, ఉగ్ర) స్వామివారల సేవలు హంస వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గ సేవాసమితి, చింతామణి చెరువు వద్ద మహాశక్తి సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్ పాల్గొన్నారు. కొండగట్టు అంజనేయస్వామి సన్నిదిలో అమ్మవారు ఆదివారం చండీ మాతగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

మళ్లీ తెరపైకి నిజాం షుగర్స్

- ప్రతి ఎన్నికలో చర్చనీయాంశంగా మారిన పునరుద్ధరణ వ్యవహారం
- పునఃప్రారంభానికి ప్రక్రియ ప్రారంభించిన ప్రభుత్వ కమిటీ
- ఇటీవల రైతులతో అధికారుల సమావేశం


ముత్యంపేట చక్కెర కర్మాగారం

జగిత్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని నిజాం చక్కెర కర్మా గారం వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. రాజకీయ పార్టీల గెలుపోటము లను ప్రభావితం చేస్తూ వచ్చిన నిజాం చక్కెర కర్మాగారాన్ని పునః ప్రారంభించే విషయంలో రైతుల సహకారం కీలకం కానుంది. తాజాగా మల్లాపూర్ మండలం ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్స్ లిమి టెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) కర్మాగారం పరిధి లోని రైతులతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, ఇన్ఫ ర్మేషన్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ ఆఫ్ షుగర్ సీ.హెచ్ నర్సిరెడ్డి, కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీని తెరవడానికి చెరుకు సాగు కీలకమని, రైతులను ఆ దిశగా ప్రోత్సహించే ప్రయత్నాలు చేశారు. దీంతో చక్కెర కర్మాగారం పునరుద్ధరణపై రైతుల్లో ఆశలు చిగురించాయి.

● అమలుకు నోచుకోని బీఆర్‌ఎస్ హామీ..

నిజామాబాద్ జిల్లా బోధన్ కేంద్రంగా 1938 సంవత్సరంలో నిజాం సర్కారు నిజాం చక్కెర కర్మాగారం ప్రారంభించింది. దీనికి అనుబంధంగా జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో పరిశ్రమలను స్థాపించింది. గత పాలకుల విధానాలు, పరిశ్రమ నష్టాల బాట పట్టిందన్న కారణంతో 2002 సంవత్సరంలో ప్రైవేటీకరణ చేశారు. ఈ మూడు యూనిట్లలో ప్రైవేటు డెల్టా కంపెనీ 51శాతం, ప్రభుత్వం 49 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. అయినప్పటికీ నష్టాల నుంచి బయట పడకపోవడంతో 2015 డిసెంబరు 23వ తేదీన లేఆఫ్‌గా ప్రకటించి బోధన్, ముత్యంపేట, ముంబోజుపల్లి కర్మాగారా లను యాజమాన్యం మూసివేసింది. తదుపరి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో కర్మాగారాలను తెరిపిస్తా మని హామీనిచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాల పునరు ద్ధరణపై కసరత్తులు చేస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభు త్వం మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా జగిత్యాలకు చెందిన మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, పలు విభాగాలకు చెందిన రాష్ట్ర స్థాయి అధికారులను నియమించింది. కమిటీ ఇప్పటికే కర్మాగారాలను సందర్శించి ప్రభు త్వానికి సమాచారం అందిస్తోంది. స్థానిక సంస్థలైన మండల పరిషత్, జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మరోమారు నిజాం షుగర్స్ పునరుద్ధరణ వ్యవహారం మరోమారు తెరపైకి రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీ యాంశంగా మారింది.

● ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ..

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్‌డీఎస్‌ఎల్ పునరుద్ధరణకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈమేరకు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను పునరుద్ధరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అడుగులు వేసినప్పటికీ సరియైన స్పష్టత రావడం లేదు. జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారంతో పాటు నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజిపల్లి కర్మాగారాలను తెరిపించడానికి గత యేడాది జనవరిలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ కొంత ప్రక్రియ పూర్తి చేసింది. ఉమ్మడి యాజమాన్యం పరిధిలోని ఈ ఫ్యాక్టరీలకు చెందిన రూ.400 కోట్ల బ్యాంకుల బకాయిలకు సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.190 కోట్లు చెల్లించింది. నిజాం షుగర్స్‌ను పునరుద్ధరించినప్పటికీ తాము నడపలేమని భాగస్వామ్య సంస్థ అయిన డెల్టా పేపర్స్ లిమెటెడ్ గతంలోనే ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సంస్థలో 51 శాతం వాటాను కలిగి ఉన్న డెల్టాకు స్వస్తి పలకాలంటే ఆస్తుల విలువ, సాంకేతిక స్థితిగతులు, న్యాయపరమైన చిక్కులు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. 2025 డిసెంబరు నాటికి ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించినప్పటికీ అది మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కర్మాగారం పరిధిలో రైతులు గణనీయమైన విస్తీర్ణంలో చెరుకు పంట పండించేందుకు ముందుకు రావాల్సి ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఈ దిశగా రైతులను ప్రోత్సహించడానికి సర్కారు ప్రయత్నాలు చేస్తోంది.

రైతులు చెరుకు సాగుకు సంసిద్ధంగా ఉన్నారు


-వాకిడి సత్యంరెడ్డి,కిసాన్‌సెల్ నేత, జగిత్యాల



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలోని రైతులు చెరుకు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉండడంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. దీంతో రానున్న క్రషింగ్ సీజన్‌లోపు చెరుకు సాగును పెంచడానికి రైతులు సానుకూలతను వ్యక్తం చేస్తున్నారు.

కర్మాగారం పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

-అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి



చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా ఇప్పటికే కర్మాగారానికి చెందిన పలు బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన కమిటీ కర్మాగారాన్ని సందర్శించి నివేదిక అందించింది. ఇటీవల ఉన్నతాధికారుల బృందం చెరుకు రైతులతో సమావేశం నిర్వహించింది.

వేములవాడ రాజన్నకు భక్తుల మొక్కులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న ఆల యానికి తరలివచ్చిన భక్తులు ముందుగా తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ఈ సంద ర్భంగా ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామివారలను దర్శించుకుని తరించారు. రాజన్నకు ఇష్టమైనకోడెమొక్కు చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


నెమలివాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నెమలి వాహనంపై ఊరేగిన స్వామివారు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వ హిస్తున్న దేవినవరాత్రోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీస్వామివారలు నెమలివాహనంపై పెద్దసేవ కార్యక్ర మాన్ని నిర్వహించారు. రాజన్న ఆలయంలో సాయం త్రం ఉత్సవమూర్తులు నెమలివాహనంపై కొలువదీరగా ప్రత్యేక పూజలుచేసి అంతరాలయంలో పెద్దసేవ ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు ప్రతాపరామకృష్ణ ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వెన్నెంపల్లి యువతికి మూడు ఉద్యోగాలు


జంపాల అనూష

సైదాపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండ లంలోని వెన్నెంపల్లి గ్రామానికి చెందిన జంపాల లక్ష్మి-పోచయ్యల కూతురు జం పాల అనూష ఏకంగా మూడు ఉద్యోగాలు సాంధించింది. ప్రస్తుతానికి అనూష హైదరాబాద్‌లోని ఉస్మానియా యూని వర్సిటీలో జూనియర్‌అసిస్టెంట్‌గా పని చేస్తోం ది. నాలుగురోజుల క్రితం తెలంగాణ ప్రభు త్వం ప్రకటించిన గ్రూప్-1లో అసిస్టెంట్ ట్రెజరర్‌గా ఎంపిక కాగా ఆదివారం ప్రక టించిన గ్రూప్-2లో సెక్రటేరియట్‌లో అసిస్టెంట్‌సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యింది. గ్రూప్-3లో సైతం 230వ ర్యాంక్ సాధిం చింది. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన అనూషను పలువురు అభినందించారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- భీమేశ్వర ఆలయంలో పనుల పరిశీలన


నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యూలైన్‌లను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో అభివృద్ధిపనులను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ సూచించారు. భీమేశ్వర ఆలయం, వీఐపీరోడ్డు, పార్కింగ్ స్థలాలతోపాటుగా ఇతర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలుచేశారు. అభివృద్ధి పనులనుగడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. వేదపాఠశాల ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లు చేస్తున్న వసతులపై సమీక్ష నిర్వహించారు. ఆయనవెంట ఈవో రమాదేవి, కార్యనిర్వాహక ఇంజనీర్‌రాజేష్,రఘునందన్,మహిపాల్‌రెడ్డి,శ్రావణ్‌కుమార్, ఉన్నారు.

● రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళం..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదానసత్రానికి కొమురవెల్లి అశోక్- అనిత దంపతులు ఆదివారం విరాళం అందజేసినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌కు చెందినఅశోక్-అనిత దంపతులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ గౌరిబట్ల శ్రీనివాస్‌శర్మకు రూ.86,620 అందించారు.

నరసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని కరీంనగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శివకుమార్ సతీసమేతంగా ఆదివారం సందర్శించారు. ఆలయం పక్షాన జడ్జి దంపతులకు వేదపండితులు, అర్చకులు, సిబ్బంది మంగళవాయిద్యాలు వెంటరాగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ వారికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు.


పూజలు నిర్వహిస్తున్న కరీంనగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శివకుమార్

ముసురు వర్షానికి కూలిన ఇల్లు

ఓదెల,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాత్రి ముసురు వర్షానికి ఒజ్జాల మొగులయ్య అనే గీత కార్మికునికి చెందిన ఇల్లు కూలిపోయింది. రెండు రోజుల క్రితం నుంచి కురిసిన ముసురు వర్షానికి ఇంటి గోడలు నానడంతో ఆకస్మాత్తుగా పై కప్పుతో సహా కూలిపోయింది. కుటుంబ సభ్యులు బయటికి రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు ఉరుస్తుండడంతో కొన్ని రోజుల నుంచి ఇంటిపై పరదాలు కప్పుకొని నివాసం ఉంటున్నారు. ఆకస్మాత్తుగా నేలమట్టం కావడంతో ఇంటిలోని సామాగ్రి ధ్వంసం కావడమే కాక కుటుంబానికి నిలువ నీడ లేకుండా పోయింది. అధికారులు స్పందించి ఆదుకోవాలని వికలాంగుడైన మొగులయ్య కోరాడు.

కరాటే శిక్షణలో మేటి

● యువతను మార్షల్ ఆర్ట్స్‌లో తీర్చిదిద్దుతున్న వసంత్‌కుమార్


అమెరికాలో కరాటే శిక్షణ పొందుతున్న పాఠశాల విద్యార్థులతో వసంత్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కఠోరశ్రమతో మార్షల్‌ఆర్ట్స్‌లో ఉత్తమశిక్షకుడిగా ఎదిగాడు కరీంనగర్‌కు చెందిన కె వసంత్‌కుమార్. కుంగ్‌ఫూ, కరాటే, కర్ర సాములో లక్షమందికిపైగా యువత, మహిళలు, పోలీసులు, విద్యార్థులకు శిక్షణ అందించాడు. కరాటే అంటే తనకు ఆరో ప్రాణంగా భావించి గత 40సంవత్సరాలుగా ఒకినావా కరాటే సంస్థల జాతీయ ఉపాధ్యక్షుడిగా, జిల్లా ఒకినావా సంస్థల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్‌గా సేవలందిస్తున్నాడు. అమెరికాలో సీసైడ్ సెల్ఫ్ డిఫెన్స్ స్కూల్‌లో కరాటే శిక్షకుడిగా పని చేశారు. అక్కడి విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను నిర్వహించారు. 1982లో కరీంనగర్‌లో ప్రారంభించిన వసంత్ కుమార్ 40 సంవత్సరాలుగా కరాటేలో శిక్షణను అందిస్తున్నారు. 2012 డిసెంబర్ 9న సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో 300 మంది ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్లకు అన్ ఆర్మ్ కంబాట్‌లో శిక్షణ అందించారు.

● అమెరికాలో శిక్షణను అందించడం ఆనందంగా ఉంది..

- కె వసంత్ కుమార్, ఒకినోవా కరాటే మాస్టర్

వేల మంది విద్యార్థులకు 40సంవత్సరాలుగా కరాటేలో శిక్షణ అందించాను. ఇటీవల అమెరికాలోని సీసైడ్‌సెల్ఫ్ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులకు కరాటేలో శిక్షణనుఇవ్వడం నా జీవితంలో మరపురాని విషయం. అమెరికాలో కరటే శిక్షణను అందించేందుకు నన్ను ప్రోత్సహించిన మాస్టర్ టెడ్‌కు నా ధన్యవాదాలు. నాలో ఓపిక ఉన్నంతవరకు కరాటేలో శిక్షణ అందిస్తాను.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లాకార్య వర్గ, మండల కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. అత్యధికంగా ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను గెలుచుకు నేందుకు కార్యాచరణతో ముందుకెళ్లాల న్నారు. స్థానిక ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు కూడా అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీల పదవీకాలం ముగిసి దాదా పుగా 20 నెలలు అవుతోందని, 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థ లకు ఎన్నికలు నిర్వహించాలని చట్టం ఆమో దించినా చేపట్టకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్య దర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొ న్నారు.

ఎస్సారెస్పీ నుంచి దిగువకు నీటి విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 39 గేట్లు ఎత్తి 4,50,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 58.709 టీఎంసీల నీరునిల్వ ఉంది. ఇందులో వరద కాలువకు 500 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

● ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి నీటి ప్రవాహం ఆదివారం ఉధృతంగా పెరిగింది. ఎస్సారెస్పీ నీటికి తోడు, కడెం ప్రాజెక్టు ఒక గేటు తెరచి 3,918 క్యూసె క్కుల నీరు దిగువ గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో సంతోసిమాత దేవాలయంలోకి నీరు చేరింది. శ్రాద్ధ మండపం ఆనుకొని నీటిప్రవాహం కొనసాగు తోంది. నదీ స్నానఘట్టాలు పూర్తిగా నీటిలో మునిగి పోయాయి. భక్తులు లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయరాదని ఆలయంపక్షాన ఈవో సంకటాల శ్రీని వాస్ మైకులద్వారా ప్రచారం చేస్తున్నారు. ధర్మపురి మండలంలోని ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం నదీ తీరానగల ప్రజలను మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సీఐ రాంనర్సింహారెడ్డి, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ అప్రమత్తం చేశారు.

● మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు మళ్లీ మత్తడిదూకుతోంది. వరుస వర్షాల తో అటు పల్వంచ, ఇటు కూడవెళ్లి వాగులు ఉధృతంగా ప్రవ హిస్తు న్నాయి. మానేరు పరవళ్ల తొక్కు తుండడంతో లింగన్నపేట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మానేరు వద్ద లోలెవల్‌వంతెన నీట మునగ డంతో ఈమార్గం గుండా రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి-సిద్దిపేట వెళ్లే బస్సులు మల్లారెడ్డిపేట మీదుగా వెళుతున్నాయి.

● ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్: దిగువ మానేరు జలాశయం నుంచి దిగువకు నీటివిడుదల కొనసాగుతోంది. మోయతు మ్మెద వాగు నుంచి 9950క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 3వేల క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 1350క్యూసెక్కులు మొత్తం 14,300క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. 6 గేట్ల నుంచి 12వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి వేయి క్యూసెక్కులు, మిషన్ భగీరథ, నీటి ఆవిరిరూపంలో 309క్యూసెక్కులు మొత్తం 13,309క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళుతోంది.


ధర్మపురి వద్ద సంతోషిమాత ఆలయం వద్ద నీట మునిగిన స్నానఘట్టాలు

నేడు సద్దుల బతుకమ్మ



పూల అమ్మకాలు, కొనుగోళ్లతో రద్దీగా మారిన 'ఖని' ప్రధానచౌరస్తా రహదారి



(5వ పేజీ తరువాయి)

పూసి ఉంటాయి. వీటిలో గునుగుపూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నంది వర్దనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపు కుంటారు.

● కిటకిటలాడిన మార్కెట్లు

రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీలలో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగనున్నాయి. పారిశ్రామిక ప్రాంతం పరిసర గ్రామాల నుంచి గ్రామస్థులతో పాటు వివిధ పూల వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి క్వింటాళ్ల కొద్ది రకరకాల పూలను శనివారం నుంచి దిగుమతి చేసుకున్నారు. పెద్ద ఎత్తున పూలను ఆటోలు, వ్యాన్‌లు, ట్రాక్టర్లలో తీసుకువచ్చారు. మహారాష్ట్ర పర్బాని, కరీంనగర్, చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బంతిపూలు దిగుమతి అయ్యాయి. ప్రధానంగా గోదావరిఖనిలోని ప్రధానచౌరస్తాతో పాటు రమేష్‌నగర్ చౌరస్తా, తిలక్‌నగర్ చౌరస్తా, ఫైవింక్లయిన్‌చౌరస్తాలలో పూల అమ్మకాలు చేస్తున్నారు. తంగెడు, గుమ్మడి పూలు, గునుగు, సీతమ్మ జడ, తామర పువ్వులు, లిల్లీపూలు, చామంతి, బంతి పూలు క్వింటాళ్ళ కొద్ది దిగుమతి చేసి అమ్ముతున్నారు. ధరలు మాత్రం ఆకాశన్నంటాయి. కిలో బంతి పూలు రూ.80 నుంచి రూ.100 పలుకగా, కేవలం 100గ్రాముల చామంతి రూ.50 పలికింది. పూల అమ్మకాలతో ప్రధాన చౌరస్తా-శివాజీనగర్, ఫైర్‌స్టేషన్, షాపింగ్ కాంప్లెక్స్ వెనుక రోడ్డు రద్దీగా మారాయి. సింగరేణి, రామగుండం కార్పొరేషన్, కార్పొరేటర్లు, ఇతర స్వచ్ఛంద సంస్థలు బతుకమ్మ ఉత్స వాలకు ఏర్పాటు చేస్తున్నాయి. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు కోదండ రామాలయంతో పాటు గోదావరినది వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ఉత్కంఠ నెలకొన్నది. రిజర్వేషన్ల విషయంలో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించడంతో వచ్చే నెల 8వ తేదీన విచారిస్తామని కోర్టు ప్రకటించడంతో ప్రభుత్వం తీసుకవచ్చిన జీఓ నిలుస్తుందా, నిలవదా అనే విషయం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకే ముందుకు వెళ తున్నట్లు సమాచారం. శనివారం మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను రొటేషన్ ప్రకారం ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీలకు 2024 కులగణన సర్వే ప్రకారం చేపట్టిన లెక్కలను అనుస రించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పిస్తూ ఈ నెల 26వ తేదీన సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 9ని జారీ చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రిజ ర్వేషన్లు 50 శాతానికి మించరాదని ఉన్నప్పటికీ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, దీనిని కొట్టి వేయాలని రెడ్డి జాగృతి సంఘం నాయకుడు ఒకరు హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సాయంత్రం వరకు కోర్టు విచారించి వచ్చే నెల 8వ తేదీ వరకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకవచ్చి గవర్నర్ ఆమోదానికి పంపించి 3 నెలలు గడవక ముందే జీఓ ఎలా తీసుక వస్తారని కోర్టు ప్రశ్నించింది. ఒకవేళ ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినా కూడా రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తామని ప్రకటించింది.

రిజర్వేషన్లపై కొందరిలో నిరాశ..

జిల్లాలో ఆయా స్థానాలపై తమకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందని ఆశించిన పలువురి నేతల అంచనాలు తలకిందులు కావడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రెండేళ్లుగా కొందరు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వంటి పదవులపై ఆశలు పెట్టుకుని ప్రజలను మచ్చిక చేసుకునేందుకు వివిధ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్లు వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. బీసీ వస్తుందని ఆశ పడ్డ స్థానాలు జనరల్‌కు రావడం వల్ల ఎవరికి ఇబ్బంది లేకుండా పోతున్నది. బీసీ లేదా జనరల్ వస్తుందని ఆశించిన వారికి ఎస్సీ రావడంతో షాక్‌కు గురవుతున్నారు. తమకు పోటీ చేసే అవకాశం పోతున్నదని అసంతృప్తికి గురవుతున్నారు. సర్పంచ్ స్థానం తమకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందనుకున్న వారి ఆశలు ఎంపీటీసీ స్థానంలో పదిలంగా ఉన్నాయి. ముందుగా ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలనే నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నది. ఈ ఎన్నికలు పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ముందుకు సాగుతున్నది. మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అదృష్టం వరించని వాళ్లు పంచాయతీ ఎన్నికల్లో తేల్చుకోవాలని భావిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనలోనే గ్రామాల అభివృద్ధి



పెద్దపల్లి ఎల్లమ్మ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ధూళికట్టలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలోనే గ్రామాలు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. ధూళికట్టలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధూళికట్టలో రూ.16.50 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, ప్రధాన రహదారులు, పాఠశాల గదులు పనులను చేపట్టామన్నారు. గృహాలు ఉన్న వారికే మళ్లీ గృహాలు ఇస్తున్నట్లుగా పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. రానున్న రోజుల్లో ఇల్లులేని ప్రతి లబ్ధిదారునికి ఇల్లు మంజూరు చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదని, రేషన్ కార్డు మంజూరు చేయలేదని విమర్శించారు. రైతులు ఎస్సారెస్పీ ఉపకాల్వలను సక్రమంగా వినియోగించుకొని నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనుల్లో రూ.12 కోట్లతో రోడ్లు భవనాల శాఖ నిధులతో ధూళికట్ట నుంచి సుగ్లాంపల్లి డబుల్ రోడ్డు నిర్మాణం, మున్నూరుకాపు సంఘం కమ్యూనిటీ భవనం, 33 ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. సింగిల్ విండో ఛైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ప్రత్యేక గ్రామాధికారి కిరణ్, కార్యదర్శి పున్నమయ్య, మాజీ సర్పంచ్‌లు గొల్లె కావేరి, బాలసాని పరుశరాములు గౌడ్, పడాల పర్శరాములుగౌడ్, అర్శణపల్లి వెంకటేశ్వర్‌రావు, ప్రసాద్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు సంతోష్‌రావు, పుల్లారావు, మహేశ్వర్‌రావు, ఏఈఓలు, జీపీ కార్యదర్శి పున్నమయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్వావలంబన, మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. ఆదివారం కనగర్తిలో రూ.24.30 లక్షలతో నిర్మించిన మహిళ సమైక్య భవనాన్ని ప్రారంభించారు. అలాగే రూ. 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను గెలిపించుకుంటే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మాజీ ఛైర్మన్ గోపు నారాయణరెడ్డి, ఆలయ ఛైర్మన్ చీకట్ల మొండయ్య, మాజీ ఎంపీటీసీ చిన్నస్వామి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, చొప్పరి రాజయ్య, ఉడిగె సదయ్య, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, జాగిరి కిషోర్, తాళ్లపల్లి శ్రీనివాస్, రఫీ పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లి కల్చరల్,(ఆంధ్రజ్యోతి): ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు తెలిపారు. ఆదివారం మున్సిపల్ అధికారులతో కలిసి ఎల్లమ్మ చెరువుకట్టను సందర్శించారు. ఆయన బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్యం, నీటి వసతి, విద్యుత్ తదితర అంశాలను తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలని, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌కు సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. సద్దుల బతుకమ్మ పండగలను ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. శాంతియుత వాతావరణంలో బతుకమ్మ, దసరా వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏఈ సతీష్, వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వరినాట్లు వేసి నిరసన

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్లే రోడ్డు చిన్న వర్షానికే చెరువును తలపిస్తుందంటూ ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమళ్ల మహేష్ ఆధ్వర్యంలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు రహదారిపై దృష్టి సారించి నీరు నిల్వకుండా చూడాలని డిమాండ్ చేశారు. కొండపర్తి సంజీవ్‌కుమార్, అపర్ణ, పవన్, రంజిత్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాకేష్, వంశీ, రమేష్ పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం

కమాన్‌పూర్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోటగిరి లక్ష్మయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన కుమారులు కోటగిరి రాజయ్య, కొమురయ్య, సదయ్య, రాములు ఆయన నేత్రాలను సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్‌కు నేత్రాలను అందించారు. శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, నూక రమేష్, బీష్మాచారి, వాసు, చారి, వెల్ది కవిత, చంద్రమౌళి సంతాపం వ్యక్తం చేశారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో సినీనటుడు మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర చిరంజీవి యువత రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఇండ్ల ఓదెలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అవగాహన లేకుండా బాలకృష్ణ చిరంజీవిని కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంథని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామయ్యపల్లిలోని సరస్వతీ శిశుమందిర్‌లో 2008-09లో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంథనిలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. కొన్నేళ్ళ తర్వాత కలిసిన స్నేహితులు ఆడి పాడి సందడి చేశారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

మంథని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వోపా ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ-25 మెరిట్ సాధించిన విశ్వబ్రహ్మ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ప్రతిభా పురస్కారాలను ఆదివారం పంపిణీ చేశారు. వోపా ప్రతినిధులు తంగళ్ళపల్లి మధూకర్, కొమురోజు శ్రీనివాస్, ములుకల్ల రాజశేఖర్, వంగళ్ల తిరుమలేష్, మియాపురం సదాశివ్, హరిప్రసాద్, భాస్కర్, శ్రీనివాస్, సతీష్, రాజశేఖర్, రవీందర్, బాలజీ పాల్గొన్నారు.

లక్కీడ్రా పేరుతో ఎస్సీలకు అన్యాయం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు అన్యాయం జరుగుతున్నదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని గ్రామాలకు ఇప్పటి వరకు ఎస్సీ రిజర్వేషన్ అవకాశం లేదని, గతంలో వచ్చిన గ్రామాలకే మళ్లీ రిజర్వేషన్లు కల్పించారన్నారు. లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్ అమలు చేయడం సరికాదని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యంతో రిజర్వేషన్ అమలు చేశారని, రిజర్వేషన్ కాని గ్రామాలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు కొండ్ర వివేక్, అజయ్, తిరుపతి, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

వేడుకలను వైభవంగా నిర్వహించుకోవాలి



ఓదెలలో దుర్గ మాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దుర్గా నవరాత్రోత్సవాలను భక్తులు వైభవంగా నిర్వహించుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం జగదాంబ సెంటర్ వద్దనున్న దుర్గమాతను దర్శించుకున్నారు. పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ హిందువుల ముఖ్యమైన పండుగ విజయదశమని, దీని పురస్కరించుకొని దేవి నవరాత్రులు పవిత్రంగా నిర్వహిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కనికిరెడ్డి సతీష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు బోడకుంట నరేష్, బుద్దే కుమారస్వామి, అలాగే చింతం మొగిలి, పోలోజు రమేష్, మాజీ ధర్మకర్తలు వెంకటస్వామి, కుమార్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎంపీవోగా ఎంపికైన పొన్నమనేని భావన



యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): యైటింక్లయిన్‌కాలనీకి చెందిన పొన్నమనేని భావన ఎంపీవోగా ఎంపికైంది. ఆదివారం విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో భావన ఎంపీవోగా మల్టీజోన్-1కు ఎన్నికైంది. ప్రస్తుతం ఆమె పెద్దపల్లి కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నది. సుందిళ్ల పంచాయతీ కార్యదర్శిగా, మారేడుగొండలో వీఆర్‌గా పని చేసింది. ఆమె తండ్రి వేణుగోపాల్‌రావు ఆర్‌జీ-3 ఏరియా ఓసీపీ-1 ఎస్అండ్‌డీ సెక్షన్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు.

బహిరంగ చర్చకు రాని రియాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైవీరావు, ఎల్లయ్య

గోదావరిఖని, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):గని ప్రమాదంలో మరణించిన కార్మికుల పిల్లలకు సూటబుల్ జాబ్ ఒప్పందం చేసుకున్న ఏఐటీయూసీపై హెచ్‌ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. ఆదివారం బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ రాలేదని ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శులు వైవీరావు, మడ్డి ఎల్లయ్యలు మాట్లాడారు. 2025, సెప్టెంబర్ 25న డిప్యూటీ చీఫ్ లేబర్ సమక్షంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంటే వక్రీకరించి హెచ్‌ఎంఎస్ రియాజ్ ఏఐటీయూసీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కార్మికవర్గాన్ని తప్పుదోవ పట్టిస్తూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను ఖండించారు. హెచ్‌ఎంఎస్‌లో పని చేసిన నాయకులను యాజమాన్యం బదిలీలు చేసి చార్జిషీట్లు ఇస్తే కాపాడుకోలేని రియాజ్ అహ్మద్ ఏఐటీయూసీని విమర్శించడం సరికాదన్నారు. గతంలో నాయిని నర్సిం హారెడ్డిని ముంచినట్టే ఇప్పుడు కల్వకుంట్ల కవితను కూడా రియాజ్ అహ్మద్ ముంచేస్తాడని వారు ఆరోపించారు. తమ యూనియన్‌పై, నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని వారన్నారు. రాజరత్నం, రాంచందర్, ఆరెల్లి పోషం, జిగురు రవీందర్, రాంచంద్రారెడ్డి, గౌతం గోవర్ధన్, మాదన మహేష్, శ్రీను పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

3న దసరా సెలవు ఇవ్వండి...

గోదావరిఖని, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సెలవును అక్టోబరు 3కు మార్చాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ బొగ్గు గనులపై సోమవారం నిరసనలు తెలిపేందుకు పిలుపునిచ్చింది. గనులు, డిపార్ట్‌మెంట్లపై సోమవారం ఉదయం 7గంటలకు కార్మికులు ధర్నాలు చేయాలని, అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందించాలని ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం ఒక ప్రకటనలో కోరారు. గాంధీ జయంతి అక్టోబరు 2న దసరా పండుగ రావడంతో కార్మికులు సెలవుతో కూడిన ఒక రోజు నష్టపోతున్నారని, యాజమాన్యం దసరా సెలవును 3న ప్రకటించి కార్మికులకు సెలవు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

మున్నూరు కాపు సంఘం భవనం నిర్మించాలి



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన సంఘం ప్రతినిధులు

మంథని, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మంథనిలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణం కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. స్థలం తోపాటు భవన నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. దీని పై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా మున్నూరు కాపు మహా సభ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్, మంథని సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మన్ కుడుదుల వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఐలి సత్యనారాయణ, ఎడ్ల సత్యనారాయణ, బాసాని రమేష్, పెంటరి రాజు, కిరణ్, బానయ్యలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా దుర్గామాత పూజలు

కమాన్‌పూర్,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): దుర్గామాత వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బాపూజీనగర్‌లో ఆదివారం మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. వేద పండితులు మనోజ్ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు.

ఎలిగేడు: ధూళికట్టలో దుర్గాదేవి నవరాత్రి వేడుకల్లో భాగంగా మాతా శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజ, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం నిర్వాహకులు అన్నదానం చేశారు. ఆంజనేయులు, సురేష్, బోగే రమేష్, శ్రీనివాస్, పవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: నిట్టూరు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గమాత మండపంలో ఆదివారం మహచండీ అమ్మవారి రూపంలో దుర్గమాత దర్శనమిచ్చారు.

మంథని: దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాంధీచౌక్‌లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ ఆదివారం నిర్వహించారు. శ్రీనివాస్, రాజేష్, సందీప్, నగేష్ పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు
సమష్టిగా కృషి చేస్తాం

పాలకుర్తి,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌లు ఎవరికి టిక్కెట్ ఇచ్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం బసంత్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో కన్నాల ప్యాక్స్ ఛైర్మెన్ బయ్యపు మనోహర్ రెడ్డి,మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బండల వాగు ప్రాజెక్టు పనులు పూర్తి చేసిన ఘనత మక్కాన్‌కే దక్కిందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కనివిని ఎరుగని రీతిలో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నాయకులు మల్లెత్తుల శ్రీనివాస్,పాత రవిందర్,దేవనందుల రాజమొగిలి,తువ్వ సతీష్,మాదాసు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.